క్లుప్తంగా

దేశభక్తి కలిగి ఉండాలి



విద్యార్థులతో హెచ్‌ఎం అప్పారావు, రామరాజు

పాతపట్నం: విద్యార్థులు ఎల్లప్పుడూ దేశభక్తిని కలిగి ఉండాలని హెచ్‌ఎం టి.అప్పారావు అన్నారు. మండలంలోని ఆర్.ఎల్.పురం ప్రాథమికోన్నత పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ పూర్వ గౌరవ అధ్యక్షుడు పి.శ్రీరాములు, పి.అప్పలస్వామి వర్ధంతి కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ శ్రీరాములు.. రామరాజు ట్రస్ట్ ద్వారా అనేక సేవలు చేశారని కొనియాడారు. పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు జాతీయ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నులు, బహుమతులను అందజేశారు. ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు, ఎస్.లోకేశ్వరరావు, బాలరాజు, మన్మధరావు, కృష్ణమూర్తి, కేశవరావు, పుష్పవతి, హేమలత, వరలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

హోర్డింగ్‌ల తొలగింపు



హోర్డింగ్‌లు, బోర్డులను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: మేజరు పంచాయతీలోని నేతాజీ వీధిలో రోడ్డుపై ఉన్న హోర్డింగ్‌లను పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు. ఈ వీధిలో పలు ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, బ్యాంకులతోపాటు షాపులు ఉన్నాయి. వీరందరూ తమ వ్యాపారాలకు ప్రచార నిమిత్తం పెద్ద, పెద్ద హోర్డింగ్‌లు, బోర్డులు పెట్టారు. మరికొందరు రోడ్డు పైకి వచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. మూడు రోజుల క్రితం కలెక్టర్ నరసన్నపేటకు వచ్చినప్పుడు రోడ్డుపై ఇష్టానుసారంగా ఉన్న హోర్డింగ్‌లు, బోర్డులు తొలగించాలని పంచాయతీ ఈఓ ద్రాక్షాయినికి ఆదేశించారు. వాహనదారులు కూడా తమ ఇబ్బందులను ఈఓ దృష్టికి తీసుకువెళ్లారు. ఈఓ ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది వచ్చి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న హోర్డింగ్‌లను తొలగించారు. పంచాయతీ సిబ్బంది చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానికులతోపాటు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల పరిశీలన



మాట్లాడుతున్న ఆర్ఐ, వీఆర్వో

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలో లక్షలాది రూపాయల విలువ గల రిజర్వ్ స్థలంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి అనే వార్త ఈ నెల 17 తేదీన సాక్షిలో రావడంతో దీనిపై టెక్కలి ఆర్డీఓ స్పందించారు. నిర్మాణాలపై విచారణ చేపట్టాలని కొత్తూరు తహసీల్దార్‌కు బుధవారం ఆదేశించారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు నిర్మాణాలను ఆర్ఐ, వీఆర్వో పరిశీలించారు. నిర్మాణాలను నిలుపుదల చేయాలని నిర్మాణం చేస్తున్న వారిని ఆదేశించారు. ఈ నిర్మాణాలపై విచారణ చేపడతామని తహసీల్దార్ తెలిపారు. విచారణలో రిజర్వ్ స్థలం అని గుర్తిస్తే నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టంచేశారు.

దుస్తుల పంపిణీ



పొందూరు: దుస్తులు పంపిణీ చేస్తున్న యూత్ క్లబ్ వలంటీర్లు

పొందూరు: మండలంలోని తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 14 మంది పేద విద్యార్థులకు బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. తల్లి, తండ్రి లేని పేద విద్యార్థులకు జత దుస్తులు, దుప్పటి అందజేసినట్లు హెచ్‌ఎం బల్ల కంటయ్య తెలిపారు. యూత్ క్లబ్ వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత..

బూర్జ: మండలంలోని పెదలంకాం గ్రామంలో ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులందరికీ పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు బుధవారం పంపిణీ చేశారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం, మండల జనసేన నాయకుడు బొత్స సురేష్ ఆధ్వర్యంలో అందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

బూర్జ: ఈ నెల 23వ తేదీన మండలంలోని మదనాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన స్వగృహంలో ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

సరిహద్దు సమస్య

- కొత్తూరు మండల కేంద్రానికి రావాలంటే రెండు చెక్ పోస్టులతో ఇబ్బందులు
- ఒడిశా లైసెన్స్ లేకపోతే కేసుల నమోదు
- ధాన్యం, ఎరువులు, ఇతర వస్తువుల రవాణాకు అవస్థలు



కౌశల్యాపురం వద్ద ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సరిహద్దు రాయి



కడుము కూడలి వద్ద ఆంధ్రాకు చెందిన చెక్ పోస్టు

కొత్తూరు: మద్రాస్ నుంచి రాష్ట్రం విడిపోయినప్పటి నుంచి కొత్తూరు మండలంలోని ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు గ్రామాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సరిహద్దు గ్రామాల ప్రజలు కొత్తూరు మండల కేంద్రానికి రావాలంటే రెండుసార్లు అంతర రాష్ట్ర రోడ్డు దాటాల్సి వస్తుంది. ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలను కలిపి ఉన్న కమిడి–వారణాసి అంతర రాష్ట్ర రహదారి మండలంలోని కడుము నుంచి దిమిలి కూడలి వరకు సుమారు 7 కిలో మీటర్ల పొడవున ఉంది. ఈ రోడ్డుకు ఉత్తరం వైపు ఒడిశాకు చెందిన గ్రామాలున్నాయి. దక్షిణం వైపు ఆంధ్రాకు చెందిన కడుము, గొట్టబద్ర, కౌశల్యాపురం, బలద, హంస, కురిగాం, మహదేవిపురం ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే కిమిడి–వారణాసి రోడ్డులోని కౌశల్యాపురం, మహదేవిపురం గ్రామాల వద్ద రెండుసార్లు అంతర రాష్ట్ర రహదారి దాటాల్సిన పరిస్థితి. ఇరు రాష్ట్రాలను కలిపి వెళ్లే రోడ్డులో రెండు రాష్ట్రాలు ఏర్పాటు చేస్తున్న చెక్ పోస్టుల నుంచి ఆయా గ్రామాల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు పైనుంచి ధాన్యం, ఎరువులతోపాటు ఇతర వస్తువులు వాహనాలపై వెళ్తున్నప్పుడు ఆ సరుకులు ఒడిశాకు చెందినవా? ఆంధ్రాకు చెందినవా? అని అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రాకు చెందిన లైసెన్స్‌తో ఉన్న కార్లు, ఇతర వాహనాలు వెళ్లినప్పుడు ఒడిశాకు చెందిన రోడ్డు ఉన్నందున ఆ రాష్ట్రానికి చెందిన ఆర్టీఓ, పోలీసులు పట్టుకుని కేసులు రాస్తున్నారు. ఉమ్మడి రోడ్డుకు బదులు కడుము నుంచి ఆల్ ఆంధ్రా రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆల్ ఆంధ్రా రోడ్డు నిర్మించాలి



కొత్తూరు మండలానికి చెందిన సరిహద్దు గ్రామాల ప్రజలు రెండు రాష్ట్రాలను కలిపి ఉన్న రోడ్డుతో పలు సమస్యలు పడుతున్నారు. కడుము నుంచి మాతల వరకు ఆల్ ఆంధ్రా రోడ్డు నిర్మించాలి. అప్పుడే సమస్య తీరుతుంది.

– వలురౌతు ధర్మారావు, మాజీ సర్పంచ్ కడుము, కొత్తూరు మండలం

చెక్ పోస్టులతో ఇబ్బందులు..



కొత్తూరుకు రావాలంటే రెండు రాష్ట్రాలకు చెందిన చెక్ పోస్టులు దాటి రావాల్సి వస్తుంది. ఇరు రాష్ట్రాలకు చెందిన రోడ్డు కావడంతో ఒడిశాకు చెందిన అధికారులుతో ఇబ్బందులు పడుతున్నాం.

– సేపాన అశోక్ కుమార్, కురిగాం, కొత్తూరు మండలం

ప్రతిభావంతులకు ఎక్స్‌లెన్స్ అవార్డులు



అవార్డుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నరసన్నపేట: సేవా కార్యక్రమాలు చేస్తున్న వారికి, ఉత్తమ విద్యార్థులకు జీఈఓ (గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన ఎక్స్‌లెన్స్ అవార్డులు ఇవ్వనున్నామని సంస్థ అధ్యక్షుడు సద్గుణ తెలిపారు. నరసన్నపేటలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో పలుమార్లు అవార్డులు ఇచ్చామని, నరసన్నపేటలో కూడా ఆ విధంగా అవార్డులు ఇస్తామన్నారు. సేవా కార్యక్రమాలు చేసేవారు తమ వివరాలు తమకు పంపితే అందులో కొందరిని ఎంపిక చేసి అవార్డులు ఇస్తామన్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి కూడా అవార్డులు ఇస్తామన్నారు. క్రీడాకారులు, ఉపాధ్యాయులు, వైద్యులు, సమాజిక సేవకులు ఇలా వివిధ రంగాల్లో ఉన్న వారిని గుర్తించి వారి సేవలు మరింతగా పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ అవార్డుల కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఆసక్తి గలవారు ఫోన్ 9492143264కు సమాచారం ఇవ్వాలన్నారు. నరసన్నపేటకు చెందిన ఊణ్ణ వెంకటేశ్వరరావు, సంతోషి, కరుణశ్రీ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎంఈఓ-1 శ్రీరాములకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

పొందూరు: స్థానిక ఎంఈఓ–1గా జి.శ్రీరాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న శ్రీరాములుకు ఎంఈఓ–1గా అదనపు బాధ్యతలు అప్పగించారు. శ్రీరాములను ఎంఈఓ–2 పట్నాన రాజారావు, ఎమ్మార్సీ సిబ్బంది ఆహ్వానించారు. ఇప్పటివరకు ఎంఈఓ–1గా పనిచేసిన రాజేంద్రప్రసాద్ జిల్లా డీసీఈబీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. నిబంధనల మేరకు తిరిగి డీసీఈబీ సెక్రటరీగా వెళ్లారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కొత్తూరు: ఈ నెల 24వ తేదీన కొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు కొత్తూరు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొత్తూరు, మహసింగి, బడిగాం, కుంటిభద్ర, వసప కాలనీ, మెట్టూరు, లబ్బ, నీలకంఠాపురం, గొట్టిపల్లితోపాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు.

సోషల్ క్లబ్ స్థల వివాదంపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

పొందూరు: పొందూరులోని సోషల్ క్లబ్ స్థలంపై నెలకొన్న వివాదంపై శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయిప్రత్యూష బుధవారం విచారణ చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 188 సర్వే నంబర్ పోరంబోకు (ప్రభుత్వ స్థలం)లో ఉన్న సోషల్ క్లబ్ స్థలం తమ దేనంటూ ఆరుగురు వ్యక్తులు 187 సర్వే నంబర్‌తో పొజిషన్ పత్రం పొందారు. వీరినుంచి ఆ స్థలం వేరొక వ్యక్తి కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్పంచ్ ఆర్.లక్ష్మితోపాటు క్లబ్ ప్రతినిధులు వ్యతిరేకించి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్డీఓ సాయి ప్రత్యూష తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రెవెన్యూ, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ ఎస్‌ఎల్‌ఆర్ రికార్డుల్లో ఈ క్లబ్ 188 సర్వే నంబర్‌లో ప్రభుత్వ స్థలంగా, పంచాయతీ రికార్డుల్లో ఈ స్థలం పంచాయతీ స్థలంగా ఉన్నట్లు గుర్తించారు. స్థల వివాదానికి వీఆర్వో జారీ చేసిన పొజిషన్ పత్రమే కారణమని నిర్ధారణ చేశారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించకుండా పొజిషన్ పత్రం జారీచేసిన వీఆర్వోపై తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటేష్ రామానుజులుకు ఆర్డీఓ ఆదేశించారు. పంచాయతీ రికార్డుల ప్రకారం నివేదికలు అందజేయాలని ఈఓ మోహన్‌బాబుకు సూచించారు. ఈ స్థలంపై పూర్తిస్థాయి సర్వే నిర్వహించి సమగ్ర నివేదికను అందించాలని తహసీల్దార్‌కు ఆదేశించారు.

పక్కాగా నాడు-నేడు రికార్డులు



రికార్డులు పరిశీలిస్తున్న విజయకుమారి

పొందూరు: నాడు–నేడు పనులు జరిగిన పాఠశాలల్లో సంబంధిత పనులకు పక్కాగా రికార్డులు ఉండాలని డీప్యూటీ ఈఓ ఆర్.విజయకుమారి అన్నారు. మండలంలోని లోలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం పరిశీలించారు. నాడు–నేడు పనులు జరిగిన పాఠశాలల్లో సామాజిక తనిఖీలు జరుగుతున్నాయని చెప్పారు. టీఏఎస్ శత శాతం పూర్తిచేయాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనని అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఎంఈఓ–2 పట్నాన రాజారావు, హెచ్‌ఎం సంజీవరావు ఉన్నారు.

బస్సు డ్రైవర్లకు అవగాహన



డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పొందూరు: విద్యార్థులను క్షేమంగా ఇంటికి చేర్చడమే ధ్యేయంగా బస్సు డ్రైవర్లు పనిచేయాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. పొందూరు భాష్యం స్కూల్ బస్సు డ్రైవర్లకు బుధవారం పలు సూచనలిచ్చారు. బస్సులను నెమ్మదిగా నడపాలన్నారు. విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పాఠశాలకు బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ టి.సుబ్రహ్మణ్యంకు సూచించారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న కరుణాకరరావు

పాతపట్నం: పీఎం సూర్యఘర్ పథకాన్ని (సోలర్ పథకం) ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సచివాలయ ఉద్యోగులకు మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు ఆదేశించారు. మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామ సచివాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను, ఉద్యోగుల హాజరును పరిశీలించారు. మిస్సింగ్ సిటిజన్ సర్వేలో ఎవైతే పెండింగ్‌లో ఉన్నాయో వాటన్నింటినీ త్వరగా పూర్తి చేయాలన్నారు. రాము, శ్యామ్‌సుందరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ..



విచారణ చేపడుతున్న ఏపీడీ లోకేష్

జలుమూరు: మండలంలోని అల్లాడ గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.రామ్మూర్తిపై డ్వామా పీడీకి నివేదిక అందజేయనున్నామని నరసన్నపేట క్లస్టర్ ఏపీడీ కె.లోకేష్ అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు సచివాలయంలో వేతనదారుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఏపీఓ కె.శేఖర్, సర్పంచ్ బి.అసిరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అపరాలకు పోషకాలు అందించాలి



కరవంజలో మాట్లాడుతున్న ఏడీ రవీంద్రభారతి

జలుమూరు: అపరాలైన పెసర, మినుము, పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలకు సస్యరక్షణతోపాటు పోషకాలు అందించాలని ఏడీ కె.రవీంద్రభారతి అన్నారు. బుధవారం కరవంజ, వెలుసోద, కూర్మనాథపురం గ్రామాల్లో పొలాలను పరిశీలించి మాట్లాడారు. నూని గింజ పంటలకు తగిన ఎరువులను వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో వేయాలన్నారు. ఏఓ కె.సురేష్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీస్తున్న డీఎల్‌పీఓ రమణ

<u>నరసన్నపేట:</u>

మండల కేంద్రం నరసన్నపేటలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి చేస్తామని డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీని బుధవారం పరిశీలించారు. మండలంలో ఉన్న అన్ని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. నరసన్నపేటలోని కేంద్రం అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా అనువుగా ఉందన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోనున్నామన్నారు. నరసన్నపేట ఈఓ ద్రాక్షాయిని, తదితరులు ఉన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు



షేక్ శ్రీనివాసరావు మృతదేహం

ఆమదాలవలస: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. లెప్రసీ కాలనీకి చెందిన షేక్ శ్రీనివాసరావు (49)గా భావించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుని కుమారుడు షేక్ జోసఫ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. తన తండ్రి అనుమానాస్పదంగా మృతిచెందాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు దేవాలయాల వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేవాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



జలుమూరు మండల నాయకులతో ధర్మాన కృష్ణదాస్

- పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

పోలాకి: నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, పూర్వవైభవాన్ని తీసుకురావటానికి ప్రతీఒక్క కార్యకర్త కృషిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ శ్రేణులకు సూచించారు. బుధవారం మబగాంలోని ఆయన నివాసంలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల పార్టీ విభాగాల బాధ్యులు, ముఖ్య నాయకులతో విడివిడిగా సమావేశమయ్యారు. ఇటీవల అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను, నాయకులను ఇబ్బంది పెడుతున్న తీరును కృష్ణదాస్ దృష్టికి తీసుకువచ్చారు. సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, అవసరమైతే ప్రత్యక్ష పోరాటాలు చేయటానికైనా సిద్ధంగా ఉండాలని కృష్ణదాస్ సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటానికి సోషల్ మీడియా ద్వారా గ్లోబల్ ప్రచారం చేయటం, విపక్షంపై ఎదురుదాడి చేయటం జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు ధైర్యం చెప్పారు. అన్ని విధాలా అండగా ఉంటానన్నారు.

మూలకుచేరిన ‘కియోస్కో’



సారవకోట మండలంలోని అంగూరు రైతు భరోసా కేంద్రానికి గత ప్రభుత్వ హయాంలో అందించిన కియోస్కో యంత్రం మూలకు చేరింది. రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన ఈ యంత్రాన్ని స్థానిక సచివాలయంలో సంబంధిత సిబ్బంది మూలకు చేర్చారు. ఈ యంత్రం ఇచ్చిన నాటినుంచి నేటివరకు ఒక్కసారి సైతం వినియోగించే దాఖలాలు లేవు. రైతుల సమాచారం, ఆన్‌లైన్లో పొందుపర్చిన పలు విషయాలను తెలుసుకునేందుకు వేలాది రూపాయలు వెచ్చించి అందించిన ఈ యంత్రం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది.

– సారవకోట

ఆశాజనకంగా మొక్కజొన్న పంట



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని మిరియాపల్లి ప్రాంతంలో ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న పంట. మండలంలోని వంశధార నదీ తీరంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట పండిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో కురిసిన వర్షాల అనంతరం పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో కలిసి చేపట్టిన సస్యరక్షణ చర్యలు, ఇతర ప్రయత్నాలు ఫలించటంతో మొక్కజొన్న పంట పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి. మండలంలోని వంశధార నదీతీర గ్రామాలైన దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేటతోపాటు స్కాట్‌పేట, మోదుగువలస, పెద్దకోట తదితర గ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు.

– ఎల్.ఎన్.పేట

ధర్మాన సోదరుల పరామర్శ



ఖాన్‌సాహెబ్‌పేటలో మెండ రమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన సోదరులు

పోలాకి: మబగాం పంచాయతీలో ఖాన్‌సాహెబ్‌పేట, మబగాం గ్రామాల్లో పలు కుటుంబాలను మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, ధర్మాన ప్రసాదరావు బుధవారం పరామర్శించారు. ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన మెండ రమణ, వైశ్యరాజు జగదాంబ, గొల్లంగి మల్లేసు, యలమంచి పోతయ్య, ఆలేటి సన్యాసి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. పరామర్శించిన వారిలో ధర్మాన లక్ష్మణదాస్, కంచు రమణ, త్యాగరాజ్, ధర్మాన షణ్ముఖరావు, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

తప్పిన ప్రమాదం



కూరుకుపోయిన ట్రాక్టర్

పాతపట్నం: మెళియాపుట్టి నుంచి నిత్యావసర సరుకులతో ట్రాక్టర్ పాతపట్నం వస్తుండగా ఆల్ ఆంధ్రా రోడ్డు సమీపంలో వెనుక టైరు కూరుకుపోయింది. ట్రాక్టర్ ఒక్కసారిగా వెనక్కు వాలిపోవడంతో పైనున్న ఇద్దరు కలాసీలు పడిపోయారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల బీఎస్ఎన్ఎల్ కేబుల్ కోసం రోడ్డు పక్కన గోతులు తీసి, సక్రమంగా పూడ్చకపోవడంతో ట్రాక్టర్ కూరికుపోయింది.

ఎండీఎం బకాయిలు చెల్లించాలని వినతి

సారవకోట: మండలంలోని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు బకాయిలు చెల్లించడం లేదని తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ మోహన్‌కుమార్‌కు స్థానిక వ్యాపారులు బుధవారం వినతిపత్రం అందించారు. సుమారు రూ. 1.50 లక్షల బిల్లులు తమకు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుని తమ బకాయిలు ఇప్పించాలని కోరారు.

రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన

బూర్జ: మండలంలోని పలు గ్రామాలకు మంజూరైన రోడ్డు నిర్మాణ పనులకు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. వైకుంఠపురం నుంచి అల్లిపల్లి గూడ, కొత్తవలస, మదనాపురం నుంచి జి.వి.పురం, సరుబుజ్జిలి–మదనాపురం నుంచి బొడ్లపాడు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణ పనులు సీతంపేట ఐటీడీఏ, ఉపాధి నిధులతో చేపట్టనున్నారు. ఎంపీపీ కర్నేన దీప, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్లు

ఆమదాలవలస: రాష్ట్ర కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహన్‌రావు అన్నారు. మండలంలోని చీమలవలస రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో పండించే అపరాల పంటలకు ఆశించే వివిధ రకాల చీడ, పీడలు, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. సర్పంచ్ సనపల చెల్లం నాయుడు, రైతులు పాల్గొన్నారు.